క్లుప్తంగా

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మృతి



మెంటాడ: మండలంలోని జక్కువ గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ కుపిరెడ్డి శంకరరావు శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, జెడ్పీటీసీ లెంక సన్యాసప్పలనాయుడు సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అప్రెంటీస్ మేళాకు విశేష స్పందన

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శనివారం నిర్వహించిన అప్రెంటీస్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈఐడీ ప్యారీ ఆధ్వర్యంలో ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఇన్‌స్ట్రుమెంట్స్ విభాగాల్లో జరిగిన ఇంటర్వ్యూలకు మొత్తం 179 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు తెలిపారు. వీరిలో 22 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు.

పక్కాగా కుల గణన చేపట్టాలి

బాడంగి: మండలంలో ఈ నెల 27వ తేదీ నుంచి పక్కాగా కుల గణన చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు, ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దార్ అజురఫీజాన్ ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశమైన వారు కుల గణనకు చెందిన యాప్‌ను వలంటీర్లతో డౌన్‌లోడ్ చేయించి, ఇంటింటికీ వెళ్లి, కులాల వారీగా వివరాలు సేకరించాలన్నారు. ప్రతీ కుటుంబంలో 18 ఏళ్లు నిండిన వారితో బయోమెట్రిక్ వేయించి, సర్వే పూర్తి చేయాలని తెలిపారు

నూతన కార్యవర్గం ఏర్పాటు

రేగిడి: స్థానిక ఐకేపీ కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం ఏర్పాటు శనివారం జరిగింది. ఏపీఎం బి.గోవిందరావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో కమిటీ అధ్యక్షురాలిగా సారోతు సుభాషిణి, ఉపాధ్యక్షురాలిగా కుదుగాన సత్యవతి, కోశాధికారిగా బెవర అప్పమ్మ, కార్యదర్శిగా కోట్ల గౌరి, ఉప కార్యదర్శిగా రాజాపు లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏపీఎం తెలిపారు. అనంతరం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం

బొబ్బిలి: మండలంలోని కలువరాయి గ్రామంలో శ్రీఅరుణాచలరమణగణపతి ఆశ్రమంలో నిర్వహిస్తున్న కావ్యకంఠగణపతి ముని 145వ జయంత్యుత్సవంలో భాగంగా శనివారం రుద్రాభిషేకం, హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొనగా, రమణ మహర్షి ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు.

చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలి

బాడంగి: మండలంలోని ముగడ గ్రామ సచివాలయాన్ని మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని, సేవల నిమిత్తం సచివాలయానికి వచ్చే ప్రజలతో చక్కగా వ్యవహరించాలన్నారు. అంతకుముందు సచివాలయ రికార్డులు పరిశీలించిన ఆయన సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



రేగిడి: వైద్యసేవలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

సంతకవిటి: మండలంలోని మండవకురిటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బాధ్యతాయుతంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. అంతకుముందు వ్యాక్సినేషన్, ఫార్మసీ ల్యాబ్, ప్రసూతి గది, ఈహెచ్‌ఆర్‌లను ఆయన పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు.

రేగిడి: స్థానిక పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో భాస్కరరావు శనివారం సందర్శించి, ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో సమావేశమై, వారు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు అసిరినాయుడు, సోహినీరాగవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి



ఆటోడ్రైవర్లకు యూనిఫాం అందజేస్తున్న ఎస్పీ దీపికా పాటిల్

బాడంగి: రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్పీ ఎం.దీపికా పాటిల్ కోరారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం సందర్శించిన ఆమె రికార్డుల పరిశీలన తర్వాత ఆటోడ్రైవర్లతో సమావేశమై, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. పరిమిత లోడుతో వాహనాలు నడపాలన్నారు. అనంతరం ఆటోడ్రైవర్లకు యూనిఫాం పంపిణీ చేశారు. ఆమె వెంట బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్, సీఐ కె.తిరుమలప్రసాద్, ఎస్‌ఐ ఆర్.జయంతి ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని కోడూరు గ్రామ సచివాలయం–2 పరిధిలోని అచ్చియ్యపేట, గొల్లలపేట, బ్రహ్మన్నవలస గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు చిన్నచిన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని వర్గాల ప్రజలు, అన్ని ప్రాంతాలు బాగుండాలన్న సదుద్దేశ్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత ఆయనదేనన్నారు. మరోవైపు ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో ప్రజలు మౌలిక సదుపాయాల నిమిత్తం రూ.20 లక్షల నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులు చేయిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాలతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు చేర్చిన ఘనత జగనన్న సర్కారుదేనన్నారు. టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా ఆ పార్టీ జన్మభూమి కమిటీల ప్రమేయం లేనిదే వచ్చేవి కావన్నారు. ఇప్పుడు అలా కాదని అర్హత ఉంటే చాలని, పథకాలు, అభివృద్ధి పనులు మంజూరవుతున్నాయన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు, మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, ఎంపీడీవో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: స్థానిక పట్టణంలో డిసెంబరు 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. శనివారం స్థానిక కోర్టు సముదాయంలో న్యాయవాదులు, పోలీస్ సిబ్బందితో సమావేశమైన ఆయన రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులన్నీ ఇరుపార్టీల అంగీకారంతోనే పరిష్కరించనున్నామన్నారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు వాపసు పొందవచ్చని తెలపాలన్నారు. కోర్టు పరిధిలోని వివిధ కేసుల్లో కక్షిదారులందరికీ జాతీయ లోక్‌అదాలత్ ఉపయోగాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, ఏజీపీ ఎస్.పోలారావు, న్యాయవాదులు ఆర్.రామ్మూర్తి, కె.రమణమూర్తి, ఎం.శ్రీనివాసరావు, ఏపీపీ కిమిడి సూర్యకుమార్, రాజాం, రేగిడి, సంతకవిటి ఎస్‌ఐలు పి.నీలావతి, ఇ.శ్రీనివాస్, బి.లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగానికి ప్రభుత్వం పెద్దపీట



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం సిటీ: వ్యవసాయరంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ రైతులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పెద్దఎత్తున పత్తి అమ్మకం చేపట్టి, ప్రభుత్వం కల్పించిన క్వింటాకు రూ.7020 మద్దతు ధరను పొందాలన్నారు. రైతులందరినీ ఆర్థికంగా బలోపేతం చేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, వారికి బాసటగా నిలుస్తున్నారన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి, మోసపోవద్దన్నారు. టోకెన్లు పొందిన రైతులందరి వద్ద పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రాజాం పరిసర మండలాలకు చెందిన రైతులంతా పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంట విత్తిన నాటి నుంచి కొనుగోలు చేసేంత వరకు రైతులకు అన్ని విధాలుగా భరోసా కల్పిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. అనుకున్న సమయానికి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదును కూడా జమచేసిన ఘనత ఆయనదేనన్నారు. పాదయాత్రలో రైతుల కష్టాన్ని స్వయంగా తెలుసుకున్న ఆయన రైతుల మేలు కోరుతూ రైతు బాంధవుడయ్యాడన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, పార్టీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, ఆర్‌జేడీఎం పి.సుధాకర్, ఏడీఏఎం పి.అశోక్, మార్కెట్ కమిటీ కార్యదర్శి బి.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు, ఏవో ఎం.రేణుకాసాయి, వైఎస్సార్ సీపీ నాయకులు యాలాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

- హౌసింగ్ డేలో మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు



బాడంగి: ముగడలో హౌసింగ్ డే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



రాజాం: కంచరాంలో గృహ నిర్మాణాల పరిశీలనలో అధికారులు

బాడంగి: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముగడ జగనన్న కాలనీలోని నిర్మాణాలను ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దార్ రఫీజాన్‌తో కలిసి శనివారం పరిశీలించిన ఆయన డిసెంబర్‌లోగా నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ సిబ్బందికి సూచించారు. హౌసింగ్ ఏఈ సత్యం మాట్లాడుతూ నిర్మాణ దశల వారీగా లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు, నిర్మాణ సామగ్రి ఇస్తున్నామన్నారు. మండలంలో మొత్తం 1453 ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 1048 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. మిగిలినవి వివిధ స్థాయిల్లో ఉన్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శి సుగుణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్, ఏపీఎం భాగ్యం పాల్గొన్నారు.

గృహప్రవేశాలకు సిద్ధంకండి..

రాజాం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ఎం.వి.నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని కంచరాం జగనన్న కాలనీలో హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయన పలు సూచనలు చేశారు. నిర్మాణాలను వేగవంతం చేసి, గృహప్రవేశాలకు సిద్ధం కావాలన్నారు.

హస్తకళలపై నైపుణ్యం పెంపొందించుకోవాలి

రేగిడి: హస్తకళలపై నైపుణ్యం పెంపొందించుకోవాలని విజయవాడ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి విద్యార్థులకు సూచించారు. శనివారం ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలను సందర్శించిన ఆయన నేటితరం విద్యార్థులకు హస్తకళలపై అవగాహన కల్పించడానికి కేంద్ర జౌళీ మంత్రిత్వ శాఖ ఓ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు హస్తకళలపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు, ఎంఈవో ఎరకయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

- విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు



కంచరాంలోని జగనన్న కాలనీని పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఈఈ సురేష్‌బాబు, ఏడీఈ ఫణీంద్రకుమార్

రాజాం సిటీ: పట్టణాలతో పాటు గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని కంచరాం జగనన్న కాలనీలో ఫేజ్–2లో భాగంగా విద్యుత్ కనెక్షన్లు అందించనున్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీల్లో పూర్తయిన ఇళ్లకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నామన్నారు. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకుంటే వ్యవసాయ పంపుసెట్లకు నెలరోజుల లోపు కనెక్షన్ ఇస్తున్నామన్నారు. పట్టణంలో రెండు రోజుల్లో, గ్రామాల్లో వారం రోజుల్లో విద్యుత్ మీటర్లు అందిస్తున్నామన్నారు. ఎక్కడా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేసవిలో కూడా పూర్తి స్థాయిలో విద్యుత్ సదుపాయం ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో రాజాం మండలంలోని గడిముడిదాం, సంతకవిటి మండలంలోని హొంజరాం, రేగిడి మండలంలోని కోడిశ, వంగర మండలంలోని వీవీఆర్‌పేటల్లో సబ్‌స్టేషన్ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఒక్కో సబ్‌స్టేషన్‌కు స్థలం మినహాయించి, సుమారు రూ.4 కోట్లతో అంచనాలు రూపొందించామన్నారు. పట్టణంలోని రోడ్డు విస్తరణ పనులకు అనుగుణంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేపడుతున్నామని, దాదాపుగా పూర్తికావచ్చాయన్నారు. ప్రజలు డిజిటల్ పేమెంట్ల వైపు మొగ్గు చూపాలన్నారు. విద్యుత్ బిల్లులు తీసిన 14 రోజుల్లోగా చెల్లింపులు చేపడితే తర్వాత వచ్చే బిల్లులో సర్‌చార్జీ మినహాయింపు వస్తుందన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు 1912 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఆయన వెంట ఏడీఈ ఫణీంద్రకుమార్, ఏఈ కుమార్ ఉన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



రేగిడి: మ్యూజికల్ చైర్ ఆట ఆడుతున్న విద్యార్థులు

రామభద్రపురం/రాజాం/రేగిడి: స్థానిక శాఖా గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 20వ తేదీ వరకు జరిగే ఈ వారోత్సవాల్లో రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, మ్యూజికల్ చైర్‌పోటీలు నిర్వహించారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఓటుతో నవసమాజ నిర్మాణం

- తహసీల్దార్ సులోచనరాణి



రామభద్రపురం: బీఎల్‌వోలు సేకరించిన ఓటునమోదు దరఖాస్తులు అందుకుంటున్న తహసీల్దార్ సులోచనరాణి

రామభద్రపురం: ఓటుతో నవసమాజం నిర్మించుకోవచ్చని, 18 ఏళ్ల వయసు నిండిన వారంతా ఓటుహక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ ఎ.సులోచనరాణి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వో) సేకరించిన ఓటు నమోదు దరఖాస్తులను శనివారం ఆమె పరిశీలిస్తూ వారికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో మరణించిన వారి వివరాలను వారి కుటుంబ సభ్యుల వద్ద ఆధారాలను సేకరించి వారి ఓట్లు తొలగించాలని బీఎల్‌వోలను ఆదేశించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు నమోదు చేసుకునే అవకాశముందన్నారు. ఓటరు జాబితాలు బీఎల్‌వోల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. ఓటర్లు తమ పేర్లు జాబితాలో ఉన్నాయా లేవా అనే విషయాన్ని పరిశీలించుకుని, లేకపోతే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. రానున్న సాధారణ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ స్టేషన్లను మ్యాపింగ్ చేస్తున్నామని, ఓటరు నేరుగా తన సెల్‌ఫోన్‌లోని గూగుల్ మ్యాప్ ద్వారా కేంద్రాలకు సులభంగా చేరుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కుటుంబ సభ్యులంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నామని, అందుకోసం ఓటరు జాబితా రూపకల్పన నుంచి పోలింగ్ కేంద్రం కేటాయింపు వరకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డీటీ సుబ్బారావు పాల్గొన్నారు.

వంగర: అర్హులైన యువతీ, యువకులంతా ఓటర్లుగా నమోదు కావాలని రాజాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సుధారాణి కోరారు. శనివారం వంగర, రేగిడి మండలాల బీఎల్‌వోలతో సమావేశమైన ఆమె 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిసెంబర్ 2, 3వ తేదీల్లో ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలన్నారు. నిర్లక్ష్యం వహించిన బీఎల్‌వోలపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వంగర, రేగిడి తహసీల్దార్‌లు బి.సుందరరావు, బి.సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి

వంగర: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని సెర్ప్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, వెలుగు సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమైన ఆయన పురుగుమందులు, రసాయన ఎరువుల వినియోగంతో భూసారం తగ్గుతోందని, వాటి వినియోగం ద్వారా పండిస్తున్న పంటలు వినియోగిస్తున్న ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ పంటలు పండించి, ఆరోగ్యవంతమైన పంటతో సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో ఏపీఎం టి.మంగమ్మ, ఏపీఎంలు మీసాల చక్రపాణి, డి.భవాని తదితరులు పాల్గొన్నారు.

చోడిసాగుపై ఆసక్తి..

వంగర: రైతులు చోడిపంట(రాగులు)సాగుపై ఆసక్తి చూపాలని ఏవో తట్టికోట కన్నబాబు సూచించారు. శనివారం మండలంలోని అరసాడ, మద్దువలస గ్రామాల్లో పర్యటించిన ఆయన 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటించిందని, ఈ నేపథ్యంలో చోడి సాగు రెట్టింపు చేయాలన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు తెలిపారు. శనివారం పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణ్‌నాయుడుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ నేతలు, కార్యకర్తలతో జరిగే సమావేశానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు హాజరై, ఈ నెల 23వ తేదీన బొబ్బిలి కళాభారతి ఆడిటోరియం దగ్గర నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహణపై దిశానిర్దేశం చేయనున్నారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరుకావాలని కోరారు.

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పార్టీ మండల స్థాయి సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు హాజరుకానున్నారని, సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహణపై దిశానిర్దేశం చేస్తారన్నారు.

వరల్డ్ కప్ గెలవాలని పూజలు

భారత్.. వరల్డ్ కప్ గెలవాలని కోరుతూ రాజాం మండలం, గెడ్డవలస గ్రామ అయ్యప్పస్వామి భక్తులు శనివారం పూజలు చేశారు. ఆదివారం అహ్మదాబాద్‌లో నరేంద్రమోదీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగే క్రికెట్ వన్డే వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై ఇండియా ఘనవిజయం సాధించేలా చూడాలని అయ్యప్పస్వామిని వేడుకున్నారు.

-రాజాం సిటీ

